సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023




స్ఫూర్తి నింపిన స్పోర్ట్స్ మీట్
శాంతిభద్రతల పరిరక్షణ.. నేరాల శోధన.. తుపాకులు, లాఠీలకు పని చెబుతూ నిత్యం బిజీగా గడిపే పోలీసులకు పోలీస్ స్పోర్ట్స్ మీట్ పేరిట నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహాన్నిచ్చాయి. 8లో▸



గుడిసెలు తొలగించడం అన్యాయం
పేదలు ఇళ్ల స్థలాల కోసం వేసుకున్న గుడిసెలు తొలగించడం ఏంటని సీపీఎం ఎస్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి ప్రశ్నించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండవేడిమి అధికమవుతుంది.



న్యూస్‌రీల్

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



స్టాల్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అగ్నిమాపకశాఖ నిర్వహించిన వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈనెల 14నుంచి వివిధ ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారులు తదితర వర్గాలకు అగ్నిప్రమాదం సంభవిస్తే వాటిని నియంత్రించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. గురువారం ఫైర్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పరికరాల ప్రదర్శనను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తిలకించారు. అగ్నిప్రమాదాన్ని నివారించేందుకు పరికరాలను వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వారోత్సవాల్లో అన్ని వర్గాల ప్రజలను చైతన్యపర్చిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. వెంట నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 కోట్లు దోచుకుపోయిన హరీశ్‌రావు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రంలో రాజకీయంగా బలం ఉన్నోడిదే రాజ్యమైపోయిందని యువజన కాంగ్రెస్ పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు పూదరి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం 2022–23కుగాను డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్టీ) ద్వారా రూ.50కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే.. స్థానిక ప్రజాప్రతినిధుల అసమర్థతను అలుసుగా తీసుకుని మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాకు తరలించుకుపోయారని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ఈ నిధులను వెచ్చించాల్సి ఉండగా హరీశ్‌రావు బలవంతంగా లాక్కెళ్లారని వివరించారు. వాటిని జిల్లాకు తిరిగి ఇప్పించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని సీఎల్పీ నేత భట్టికి లేఖ అందించారు.

అకాలవర్షంతో తడిసిన ధాన్యం

పాలకుర్తి: మండలంలోని కొన్ని గ్రామాల్లో బుధవారం రాత్రి అకాలవర్షం కురిసింది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. పదిరోజులుగా మండల వ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో కుప్పలుగా పోశారు. అర్ధరాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. అధికారులు త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, లేకుంటే రైతులు నష్టపోయే ప్రమాదముందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్మారంలో ఘనంగా 'కొప్పుల' జన్మదినం



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాస తిరుపతిరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేక్‌కట్ చేశారు. నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈశ్వర్‌ను సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, డీసీసీ ఎదుల్ల కిశోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలేటి కిష్టారెడ్డి, సర్పంచు మారం జలేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాంరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'గృహ' ప్రవేశాలెప్పుడో..!

'మాది పెద్దపల్లి. ఏళ్ల తరబడి కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నం. గతనెల 15న లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా అధికారులు ఎంపిక చేసిండ్రు. అందులో నా పేరు రావటంతో సంబరపడిన. నెలరోజులైతంది. ఇప్పటికీ ఇల్లు అప్పగించడం లేదు. ఆనందమంతా ఆవిరవుతంది. అధికారులు త్వరగా లబ్ధిదారులకు అప్పగించాలి..' ఇది ఇటీవల జిల్లాకేంద్రంలోని అమర్‌చంద్ కల్యాణమంటపంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో లాటరీ గెల్చుకున్న ఓ మహిళ ఆవేదన. ఇది ఈ ఒక్క లబ్ధిదారురాలుదే కాదు.. ఇటీవల లక్కీడ్రాలో ఎంపికైన పెద్దపల్లి, రామగుండం లబ్ధిదారులందరిది.



పెద్దపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

- డబుల్ బెడ్రూం ఇళ్లకు నెలక్రితమే లాటరీ..
- నేటికీ లబ్ధిదారులకు అందని హక్కు పత్రాలు
- నిరుపేదలకు తప్పని ఎదురుచూపులు



మార్చి 15న లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

సాక్షి, పెద్దపల్లి: సొంతిళ్లు లేక.. అద్దె ఇళ్లలో ఉంటూ.. అద్దె భరిస్తూ ఇబ్బంది పడుతున్నా నిరుపేదలకు గృహయోగం కలిగింది. పెద్దపల్లి మున్సిపాలిటీ, రామగుండం కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లకు గత మార్చి 15న లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. ఇళ్లు, స్థలం లేనివారిని అర్హులుగా గుర్తించి సామాజికవర్గాల వారీగా రిజర్వేషన్ కేటగిరీని అనుసరించి లబ్ధిదారుల సమక్షంలోనే లక్కీడ్రా తీశారు. అయితే ఎంపిక చేసి నెల రోజులు దాటినా లబ్ధిదారులకు హక్కుపత్రాలు అందకపోవడంతో ఆయోమయం నెలకొంది.

నెలరోజులు దాటినా..

పెద్దపల్లి పట్టణంలో చందాపల్లి, కూనారం రోడ్డు సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు మార్చి 15న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ఆధారంగా లక్కీడ్రా ద్వారా అర్హులను ఎంపిక చేశారు. మొత్తం 2,079 దరఖాస్తులు రాగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి 1,050 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో లక్కీడ్రా ద్వారా 484మందిని ఎంపిక చేశారు. అలాగే రామగుండంలో 7,642 దరఖాస్తులు రాగా.. మార్చి 16న అర్హులైన 2,468 మందిలో 660 మందిని ఎంపిక చేశారు. ఇందులో కొంతమంది ఇళ్లు ఉన్నవారికే వచ్చాయని, ఒక్కో ఇంట్లో ఇద్దరికి వచ్చాయని, కారువంటి వాహనాలు ఉన్నవారిని ఎంపిక చేశారని బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పెద్దపల్లిలో 44, రామగుండంలో 51 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల ఫిర్యాదులతో రెవెన్యూ అధికారులు లాటరీ ద్వారా ఎంపిక చేసి లబ్ధిదారుల ఇంటికి క్షేత్రస్థాయిలో పర్యటించి అందులో కొందరిని అనర్హులుగా గుర్తించి పక్కకు పెట్టారు.

హక్కు పత్రాలు ఆలస్యమే..

అభ్యంతరాలతో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇంటి పత్రాలను ఇంకా ముద్రించలేదు. మరోపక్కన ఎంపిక చేసిన ఇళ్ల వద్ద రహదారులు, మురుగుకాలువలు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించలేదు. అక్కడ వసతులు లేకపోవడం.. కల్పించేవరకూ ఇళ్ల పట్టా ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోపక్క కేంద్రప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దరఖాస్తు చేయడంతో కొంత ఆలస్యమైనట్లు అధికారులు చెబుతున్నారు. లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు మాత్రం ఉగాది పండుగలోపు ఇస్తామని ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై డబుల్ బెడ్రూం ఇళ్ల నోడల్ అధికారి నర్సయ్య వివరణ కోరగా... లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులపై ఫిర్యాదులు రావటంతో మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేశామని, దీంతో ఆలస్యమైందని, కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్న క్రమంలో పూర్తిచేసిన వెంటనే మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో గృహప్రవేశాలు చేయిస్తామని పేర్కొన్నారు.

లీకేజీలు, స్కాంలు
దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు



మత్స్యకారులు బహూకరించిన చేపల వలతో భట్టి, చిత్రంలో మక్కాన్‌సింగ్, విజయరమణారావు

- ప్రభుత్వ విధానాలతో విద్యార్థులు, ప్రజల్లో అసహనం
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు
- వ్యవసాయ కూలీలకు కూలీబంధు
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



కాల్వశ్రీరాంపూర్‌లో బజ్జీలు వేస్తూ..

కాల్వశ్రీరాంపూర్: లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్‌కు గొడ్డలి పెట్టు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో విద్యార్థులు, ప్రజలు నిరాశకు లోనై అసహనం వ్యక్తం చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ గురువారం గంగారంలో ప్రారంభమై.. కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి, మల్యాలకు చేరుకుంది. కాల్వశ్రీరాంపూర్ బహిరంగసభలో భట్టి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు రైతుకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మధ్యాహ్నం పలువురు విద్యార్థులు భట్టిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, స్కాలర్‌షిప్‌లు అందక విద్యాభ్యాసం చేయలేకపోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక అన్నివర్గాలకు మేలు చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. కూలీబంధు తెచ్చి వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు అందిస్తామన్నారు. అభయహస్తం, స్వశక్తి మహిళలకు పావలావడ్డీతో రుణాలిప్పిస్తామని తెలిపారు.

దోచుకుంటున్న మంత్రులు..

రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టారీతిన దోచుకుంటున్నారని భట్టి తెలిపారు. అక్రమ దందాలు, లిక్కర్ స్కాంలతో ప్రజాధనాన్ని గుల్ల చేస్తున్నారని విమర్శించారు.

క్రీడాప్రాంగణంలోనే శ్మశాన వాటికలా..

ఇప్పలపల్లిలో క్రీడాప్రాంగణం, శ్మశాణ వాటికను పరిశీలించారు. రెండూ ఒకేచోట నిర్మాణం చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో ఆడుకునేందుకు ఎవరైనా సుముఖత వ్యక్తం చేస్తారా..? ఇదేనా బంగారు తెలంగాణ అన్నారు.

పలకరిస్తూ.. ముందుకుసాగుతూ..

భట్టి విక్రమార్క తన పాదయాత్రలో ప్రజలతో మమేకమయ్యారు. వారి ఇబ్బందులు తెలుసుకుంటూ భరోసా ఇస్తూ.. ముందుకుసాగారు. మండల కేంద్రంలోని ఓ హోటల్ వద్ద ఆగి బజ్జీలు, పునుగులు వేశారు. రోజు కష్టపడితే ఎంత వస్తోందని, కుటుంబపోషణకు సరిపోతున్నాయా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వస్తే గ్యాస్ ధర తగ్గిస్తామన్నారు. మత్స్యకార్మికులు చేపలవల, బుట్ట బహూకరించారు. గొర్రెలకాపరులతో మాట్లాడుతూ.. సబ్సిడీపై గొర్రెలు ఇవ్వడంతోపాటు అనుబంధ పరిశ్రమలు, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లాలో ముగిసిన భట్టి పాదయాత్ర

ఓదెల: మంచిర్యాల మీదుగా రామగుండం మండలం ఎల్లంపల్లి వద్ద జిల్లాలోకి ప్రవేశించిన భట్టి పాదయాత్ర.. గురువారం రాత్రి ఓదెల మండలం గుంపుల వద్ద ముగిసింది. మానేరు నది దాటి జమ్మికుంట మండలం తనుగులకు చేరుకుంది. ముందుగా గుంపుల గ్రామంలోనే ఆయన బస చేయాల్సి ఉండగా.. తనుగులకు చేరుకుని అక్కడ బస చేశారు.

నక్సలైట్లకు పునరావాసం కింద ఇచ్చిన భూములు లాక్కున్నారు

అభివృద్ధి అంటే పేదలకిచ్చిన అసైన్డ్ భూములు, లొంగిపోయిన నక్సల్స్ పునరావాసానికి ఇచ్చిన భూములు లాక్కోవడమేనా..? ఇదేనా బంగారు తెలంగాణ..? అని భట్టి ప్రశ్నించారు. మల్యాలలో మాట్లాడుతూ అంతర్గాంలో అసైన్డ్‌భూములు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇసుక, మట్టిమాఫియా రాజ్యమేలుతోందన్నారు. బినామీ పేర్లతో జిల్లాలో 21 ఇసుకరీచ్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్, నాయకులు ఈర్ల కొమురయ్య, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, నాయకులు లంక సదయ్య, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి, జెడ్పీటీసీ గంట రాములు, సర్పంచ్ కొమురయ్య గౌడ్, లంక రాజేశ్వరి, ఎంపీటీసీ సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, కట్కూరి సుధాకర్ రెడ్డి, మనోహర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, మౌనిక రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కాలువ, చెరువుగట్లపై మొక్కలు పెంచుదాం



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

- ప్రతి ఊరిలో క్రీడాప్రాంగణాలు పూర్తిచేయాలి
- కూలీలకు ఎండదెబ్బ తగలకుండా పనులు చేపట్టాలి
- అధికారులతో కలెక్టర్ సంగీత వెల్లడి

పెద్దపల్లిరూరల్: ఎస్సారెస్పీ కాలువలు, చెరువు గట్ల భూములు అన్యాక్రాంతం కాకుండా ఆయా భూముల్లో విరివిగా మొక్కలను నాటి కాపాడుదామని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి పలు అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జూన్ నుంచి హరితహారం మొదలయ్యే అవకాశముందని, ఈలోపు అధికారులు కాలువ, చెరువుగట్ల భూములను పరిశీలించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి, కాళేశ్వరం, ఎస్సారెస్పీ ఇతర ప్రాజెక్టు భూముల ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. బ్లాక్ ప్లాంటేషన్ కోసం 108 ఎకరాలు, కెనాల్ ప్లాంటేషన్ కోసం 636 కిలోమీటర్లు, సాయిల్ ప్లాంటేషన్ కోసం 145 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని డీఆర్‌డీవో శ్రీధర్ తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్థల సమస్య ఉన్న గ్రామాల్లో వారంలోపు సందర్శించి పరిష్కారం చూపాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని కూలీలతో ఉదయం, సాయంత్రం పనులు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితానుంచి తొలగించిన పేర్ల వివరాలను ధ్రువీకరించుకోవాలన్నారు. 593 మంది ఓటర్ల పూర్తి రికార్డు పోయిందన్నారు. ఈ నెలాఖరుకల్లా పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి బూత్‌స్థాయి అధికారుల నియాకమాల్లో మార్పులు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి, డీఎఫ్ఓ శివయ్య, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవో, ఈఈ, డీఈఈ తదితరులున్నారు.

ఆదివాసీలకే పోడు హక్కుపత్రాలివ్వాలి



అమరవీరుల స్తూపం వద్ద ప్రజాసంఘాల నాయకులు

పెద్దపల్లిరూరల్: పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసీ, గిరిజనులకే హక్కు పత్రాలు అందించాలని వి.ర.సం ఉమ్మడి జిల్లా బాధ్యులు బాలసాని రాజయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కోకన్వీనర్ గాండ్ల మల్లేశం డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. 42 ఏళ్ల క్రితం అప్పటిప్రభుత్వం ఆదివాసీలపై అమానుషంగా కాల్పులు జరిపి 60మంది చంపి.. కేవలం 13మంది మాత్రమే చనిపోయారని ప్రకటించిందని ఆరోపించారు. టైగర్‌జోన్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన పేరిట కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే యత్నం చేస్తోందన్నారు.

'ముక్కోటి'కి ముందురోజే ముహూర్తం..!

- 'అరుణ్ తలకోస్తా' అని సాయి శపథం
- 'సాక్షి' చేతిలో సాయి వార్నింగ్ వీడియో
- సాయి గ్యాంగ్ కాల్పులతో ఉలిక్కిపడిన మానకొండూరు
- గురితప్పిన రెండు రౌండ్లు, పేలని రౌండ్ స్వాధీనం
- పొరుగింట్లోకి దూరి ప్రాణాలు కాపాడుకున్న అరుణ్
- అడ్డొచ్చిన మొత్తం ఏడుగురిని చావబాదిన దుండగులు
- సోదరి మరణానికి ప్రతీకారంగానే హత్యాయత్నం
- రెండు నెలల క్రితమే బిహార్ నుంచి ఆయుధం..?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మానకొండూరు: బుధవారం అర్ధరాత్రి కాల్పుల మోతతో మానకొండూరు ఉలిక్కిపడింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పల్లెలో తుపాకులు గర్జన విని జనం భీతిల్లారు. రౌడీషీటర్ అరుణ్‌పై కత్తులు, తుపాకులతో జరిగిన హత్యాయత్నం జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నేరచరిత్ర కలిగిన అరుణ్ ఆది నుంచి వివాదాస్పదుడే. వరుసగా ఇతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత సీపీ సత్యనారాయణ ఇతనికి కమిషరేట్ నుంచి బహిష్కరణ విధించారు. ఇటీవల కమిషనరేట్ బహిష్కరణ పూర్తిచేసుకుని వచ్చిన అరుణ్‌పై తుపాకులతో హత్యాయత్నం జరగడం గమనార్హం. వాస్తవానికి ఈ ఘటనకు బీజం ఇప్పుడు పడింది కాదు, పాత కక్షల నేపథ్యంలో ఈ ఏడాది వైకుంఠ ఏకాదశికి ముందురోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ప్రధాన నిందితుడు సాయితేజ్ హనుమాన్ ఆలయంలోనే అరుణ్‌ని చంపుతానని ప్రతినబూనాడు.

వస్తూనే దాడి.. కాల్పులు

- పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ఉండే వీణవంక సాయితేజ్ ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ముందురోజు రాత్రి (నూతన సంవత్సరం రోజు) జీఎం కాలనీలోని హనుమాన్ గుడిలో తన సోదరి మరణానికి కారణమైన 'మానకొండూరు అరుణ్ గాని తలకాయ కోసి.. జీఎం కాలనీ చౌరస్తాలో పెట్టకపోతే నేను సూరి కొడుకునే కాదు' అని శపథం చేశాడు.
- ఈ విషయాన్ని పలువురు స్థానికులు వీడియో కూడా తీశారు. ఇప్పుడు ఈ వీడియో కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ వీడియో 'సాక్షి' చేతికి చిక్కింది. అప్పటి నుంచి సమయం కోసం ఎదురు చూస్తున్న సాయి.. బుధవారం అర్ధరాత్రి తన మిత్రులు భువనగిరి జిల్లా దత్తారుపల్లికి చెందిన పాల మల్లేశ్, మానకొండూరు మండలం కెల్లెడ గ్రామానికి చెందిన బైరగోని మధు, గోదావరిఖనికి చెందిన చంటితో కలిసి రాత్రి 9 గంటల సమయంలో వాహనంలో మానకొండూరుకు వచ్చాడు.
- వెల్ది గ్రామానికి వెళ్లే మార్గం నుంచి వీరు గ్రామంలోకి తుపాకీ, కత్తులతో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దాదాపు 9.30 గంటల సమయంలో అరుణ్ తన ఇంటి ముందు సోదరులతో కలిసి మద్యం తాగుతుండగా.. వీరికి తారసపడ్డాడు. వారిని చూడగానే భయంతో అరుణ్ పారిపోయేందుకు ప్రయత్నం చేశాడు.



అరుణ్‌ను చంపుతానంటున్న సాయి (ఫైల్)



దాడిలో గాయపడ్డ అరుణ్

- అతడిని వెంబడించిన నలుగురు బీరు బాటిళ్లతో దాడిచేశారు. అడ్డువచ్చిన అరుణ్ భార్య సుమ, పెద్ద కూతురు వైష్ణవిని తుపాకీ చూపించి తీవ్రంగా కొట్టారు. పారిపోతున్న అరుణ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరపగా గురితప్పాయి. ఓ ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. అరుణ్‌పై కోపంతో సదరు ఇంట్లోని ఐదుగురు కుటుంబసభ్యులను విచక్షణారహితంగా, రక్తాలు కారేలా కొట్టారు.
- వీరి అరుపులు విన్న స్థానికులు వచ్చారు. వచ్చిన వారిని తుపాకీ చేతబూనిన వ్యక్తి బెదిరించి పంపాడు. తరువాత చాలామంది రావడంతో సాయితేజ్ పరారు కాగా.. పాలమల్లేశ్, మధును పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు.
- పేలని బుల్లెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వాడింది కంట్రీమేడ్ తుపాకీ (తపంచా) అని తూటా ఆధారంగా నిర్ధరణకు వచ్చారు. మరో నిందితుడు చంటి కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడని సమాచారం.

మాట్లాడకుండానే.. దాడి చేశారు..



మానకొండూర్‌లో ఉన్న మా అత్త గారింటికి నా పిల్లలను చూసేందుకు వచ్చాను. బుధవారం రాత్రి అన్నం తిని బయట ఉండగా గొడవ అవుతోంది. ఈ లోగానే అరుణ్ మా ఇంటి వైపు వచ్చాడని కొందరు మా ఇంటివైపు పరుగు తీసుకుంటూ వచ్చారు. వాడేడి అంటూ ఆగ్రహంతో నాపై స్టీలు ప్యాల క్యాన్‌తో దాడి చేశారు. తల పగిలి రక్తస్రావం జరిగింది. ఇంట్లో వాళ్లపై దాడి చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. తర్వాత భయాందోళనతో చాలా సేపు తలుపు వేసుకుని ఇంట్లోనే ఉన్నాం, పోలీసులు వచ్చాక బయటకు వచ్చా. – బీరం శ్రీనివాస్, గాయపడ్డ వ్యక్తి

తనకు సంబంధం లేదంటున్న అరుణ్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. నిందితులు గోదావరిఖనికి చెందిన సాయితేజ్, చంటి, మరో ఇద్దరు మిత్రులు అని వెల్లడించాడు. ఎందుకు దాడి చేశారు..? అని అడిగిన ప్రశ్నకు.. తాను ఒక ప్రభుత్వ ఉద్యోగిని అని, తనకువారితో ఎలాంటి సంబంధమూ లేదని, వారు గంజాయి విక్రయిస్తారని తెలిపాడు. సంబంధం లేని వ్యక్తి చేసే పని, చిరునామా, పేరుతో సహా ఎలా తెలపగలిగాడు..? అన్న విషయంపై పోలీసులు దృష్టి సారించారు. అతనికి సాయితేజకు ఉన్న వైరం ఏంటీ..? అతని సోదరి మరణంలో అరుణ్ ప్రమేయం ఎంతవరకు ఉంది..? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. నిందితులకు, బాధితుడికి నేరచరిత ఉన్న విషయం వాస్తవమేనని, అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు 'సాక్షి'కి తెలిపారు. నిందితుల కోసం మొత్తం మూడు బృందాలు సాయి కోసం గాలిస్తున్నాయి. ఇందులో రెండు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఒక టీం గోదావరిఖనికి వెళ్లినట్లు సమాచారం.

బిహార్ నుంచి ఆయుధం..?

ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయికి ఆయుధం ఎక్కడిది..? అన్న విషయంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తుపాకీ కాల్చడంలో నిందితులకు అనుభవం లేదని తాజా ఘటనతో తేలిపోయింది. బుల్లెట్లు వేగంగా లోడు చేయలేకపోవడం.. గురిచూసి కాల్చలేకపోయిన విధానాన్ని బట్టి నిందితులు ఇటీవలే తుపాకీ కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. రెండు నెలల క్రితం ఓ కేసు విషయంలో సాయి సెల్‌లొకేషన్ బిహార్‌లో చూపించిందని గోదావరిఖని పోలీసులు తెలిపారు. అదే సమయంలో అతను కాశీయాత్రకు వెళ్లి వచ్చాడని గుర్తుచేసుకుంటున్నారు. దీంతో సాయికి బిహార్‌లో మిత్రులు ఉండి ఉంటారని, వారి ద్వారానే ఆయుధం కొని ఉంటాడని అనుమానిస్తున్నారు.

క్లుప్తంగా

అక్రమ వెంచర్‌లో హద్దురాళ్ల తొలగింపు



భూమి చదును చేయించి, ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

పెద్దపల్లిరూరల్‌: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వెంచర్లపై అధికారులు కొరఢా ఝుళిపిస్తున్నారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారు వ్యవసాయ భూమిలో అనుమతులు పొందకుండానే వెలసిన వెంచర్‌లో ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్‌లు గురువారం పంచాయతీ సిబ్బందితో కలిసి హద్దురాళ్లను తొలగించారు. రోడ్లు, ప్లాట్ల హద్దురాళ్లను ట్రాక్టర్‌తో చదును చేయించారు. లేఅవుట్‌ నిబంధనల ప్రకారం విక్రయించే ప్లాట్లనే కొనుగోలు చేయాలని సూచించారు. అలాంటి ప్లాట్లలో మాత్రమే ఇంటి నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు వస్తాయన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ కండక్టర్లకు శిక్షణ తరగతులు

గోదావరిఖనిటౌన్‌(రామగుండం): గోదావరిఖని ఆర్టీసీ డిపోలోని కండక్టర్లకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని డిపో మేనేజర్‌ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ సజ్జనార్‌ ఆదేశాల మేరకు ఆర్టీసీని లాభాల్లో నడిపించేలా సంస్థలోని ప్రతీ ఉద్యోగికి శిక్షణనిస్తామని అన్నారు. ఇందుకోసం ప్రొజెక్టర్, స్పీకర్‌ తదితర ఎలక్ట్రానిక్‌ పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ఉద్యోగులకు తాగునీరు, భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఏసీపీ గిరిప్రసాద్‌

మంథని: ముత్తారంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్‌ తెలిపారు. గురువారం ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముత్తారం మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు గురువారం ఎస్సై రాములు తన సిబ్బందితో కాసర్లగడ్డ వద్ద సోదాలు నిర్వహించారన్నారు. అనుమానం వచ్చి ఓ వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైందని చెప్పారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన ఉల్లి కమలాచారి వద్ద బ్యాగులో రెండు కిలోల గంజాయి దొరికిందన్నారు. విశాఖపట్నం నుంచి వరంగల్‌ అటు నుంచి జయశంకర్‌ భూపాలపల్లి టేకుమట్లకు తరలిస్తున్నట్లు విచారణలో తెలిందని చెప్పారు. గంజాయితో పట్టుపడిన వ్యక్తిని తహసీల్దార్‌ వరందస్, ఆర్‌ఐ రాజిరెడ్డిల ఎదుట బైండోవర్‌ చేసినట్లు తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకొని, ఉన్నతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గంజాయి కట్టడికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంథని సీఐ సతీశ్, ఎస్సై రాములు, హెడ్‌ కానిస్టేబుల్‌ మధునయ్య తదితరులున్నారు.

స్ఫూర్తి నింపిన స్పోర్ట్స్‌ మీట్‌



వాలీబాల్‌ ఆడుతున్న కోటపల్లి యూత్‌ టీం



పోటాపోటీగా టగ్‌ ఆఫ్‌ వార్‌

- క్రీడాపోటీల్లో పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు
- మారుమూల కోటపల్లి టీం సత్తా చాటింది..
- అందరికీ అభినందనలు : సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): శాంతిభద్రతల పరిరక్షణ.. నేరాల శోధన.. తుపాకులు, లాఠీలకు పని చెబుతూ నిత్యం బిజీగా గడిపే పోలీసులకు పోలీస్‌ స్పోర్ట్స్‌ మీట్‌ పేరిట నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహాన్నిచ్చాయి. వారు మారుమూల ప్రాంతాల యువతకు క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తూ సన్మార్గంలో నడిచేలా చూస్తున్నారు. రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో మూడు రోజుల పాటు క్రీడాపోటీలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి యువత సత్తా చాటారు. కోటపల్లి, నీల్వాయి మండలాల్లోని 34 గ్రామాల యువతకు వాలీబాల్, క్రికెట్‌ కిట్లను చెన్నూర్‌ రూరల్‌ సీఐ విద్యాసాగర్‌ పంపిణీ చేశారు. గోదావరిఖని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోలీసు క్రీడాపోటీలు రసవత్తరంగా సాగాయి. వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షటిల్, టగ్‌ ఆఫ్‌ వార్, జావెలిన్‌త్రో, చెస్, క్యారమ్స్, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్, లాన్‌టెన్నిస్, క్రికెట్, బాస్కెట్‌బాల్‌ పోటీలు జరిపారు. వీటిలో రెండు జిల్లాలకు చెందిన సుమారు 300 మంది పోలీసులు పాల్గొని, తమ సత్తా చాటారు. రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ ఏర్పడిన తర్వాత సుమారు ఆరేళ్లకు మొదటిసారిగా సీపీ రెమా రాజేశ్వరి సారథ్యంలో పోటీలు అంగరంగ వైభవంగా జరగడం పోలీసుల్లో నూతనోత్సాహం నింపింది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు సిటీ ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌(సీఏఆర్‌) జట్లు తలపడ్డాయి. సీఏఆర్‌ ఓవరాల్‌ చాంపియన్‌గా నిలిచింది. రెండు జిల్లాల డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, కానిస్టేబుళ్లు ఈ పోటీల్లో తమ వయసును మరిచి ఎంజాయ్‌ చేశారు.

అనతికాలంలోనే పోటీల నిర్వహణ

క్రీడా పోటీలకు పాలనాపరమైన అనుమతులు పొందిన రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి అనతికాలంలోనే పోటీల నిర్వహణకు సిద్ధమయ్యారు. సింగరేణి యాజమాన్యం సహకారంతో ఇరు జిల్లాల డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, సుధీర్‌కేకన్‌లు దగ్గరుండి, ఏర్పాట్లు చేశారు. బహుమతి ప్రధానోత్సవానికి మల్టీజోన్‌–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై, పోటీల నిర్వహణ తీరును అభినందించారు. ఏటా క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు.

కోటపల్లి జట్టుకు ప్రథమ స్థానం..

వాలీబాల్‌ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. వీటిలో కార్‌ జట్టు అత్యంత ప్రతిభ కనబర్చింది. ఈ జట్టును కూడా ఓడించి, కోటపల్లి జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.



సంతోషంగా ఉంది..

రెండు జిల్లాల పోలీసు జట్లతో ఆడటం సంతోషంగా ఉంది. టఫ్‌ టీంగా ఉన్న కార్‌ టీంతో పోటీ పడి, గెలవడం మరిచిపోలేని అనుభూతినిచ్చింది. నెల రోజులు ప్రాక్టీస్‌ చేశాం. మాకు సహకరించిన చెన్నూర్‌ రూరల్‌ సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకటేష్‌లకు ధన్యవాదాలు. – **అజ్మీరా సంతోష్‌నాయక్, వాలీబాల్‌ జట్టు కెప్టెన్, ఎస్సావాయి, కోటపల్లి**



పండుగలా క్రీడాపోటీలు..

క్రీడాపోటీలు మూడు రోజులపాటు పండుగలా సాగాయి. రెండు జిల్లాల పోలీసులతో పరిచయం ఏర్పడింది. క్రీడలు నిర్వహించిన సీపీ మేడంకు కృతజ్ఞతలు. నేను గతంలో తెలంగాణ వాలీబాల్‌ జట్టుకు కెప్టెన్‌గా చేశా. జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొన్నా. – **బానోతు ప్రేమ్‌కుమార్, ఓవరాల్‌ చాంపియన్, ఏఆర్‌ కానిస్టేబుల్‌**



గుర్తింపు వచ్చింది..

అన్ని పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఓవరాల్‌ చాంపియన్‌గా నిలవడం మర్చిపోలేను. నిత్యం విధుల్లో బిజీగా ఉండే మాకు ఈ పోటీలు ఉత్సాహాన్నిచ్చాయి. చిన్నప్పటి నుంచి నేర్చుకున్న క్రీడల్లో సత్తా చాటడం సంతోషంగా ఉంది. మంచి గుర్తింపు వచ్చింది. – **జ్యోతి, ఓవరాల్‌ చాంపియన్, ఏఆర్‌ కానిస్టేబుల్‌**



ఏటా నిర్వహణకు కృషి..

క్రీడాపోటీల విజయవంతం కోసం పని చేసిన అందరికీ అభినందనలు. ముఖ్యంగా పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు, ఏసీపీలు చాలా కష్టపడ్డారు. అందరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. సింగరేణి సహకారం మరవలేనిది. ఈ పోటీలు ఏటా నిర్వహించేలా కృషి చేస్తాం. – **రెమా రాజేశ్వరి, పోలీస్‌ కమిషనర్, రామగుండం**

డిగ్రీ ప్రథమ సెమిస్టర్‌ ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్‌ శశాంక, అధ్యాపకులు

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ప్రథమ సెమిస్టర్‌ ఫలితాల్లో శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బీకాం సీఏ విభాగంలో ముత్యాల సాయినిశాంక్‌ 8.71 ఎస్‌జీపీఏ సాధించి, ప్రథమ స్థానంలో, పల్మారి నవ్య 8.54 ఎస్‌జీపీఏ సాధించి, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్‌ శశాంక తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ విభాగంలో అర్కుటి సంధ్య 8.45 ఎస్‌జీపీఏ సాధించి, ప్రథమ స్థానం, మేకల వైష్ణవి 8.29 ఎస్‌జీపీఏ సాధించి, ద్వితీయ స్థానం, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో గుండారం మానిక 8.4 ఎస్‌జీపీఏ సాధించి, ప్రథమ స్థానం, సామ తబస్సుమ్‌ 7.84 ఎస్‌జీపీఏ సాధించి, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గురువారం డిక్షనరీలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అడిచర్ల శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా శ్రీధర్‌ పటేల్‌



నియామకం పత్రం అందిస్తున్న దేవయ్య పటేల్‌

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా పెద్దపల్లికి చెందిన ఉనుకొండ శ్రీధర్‌ పటేల్‌ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కొండ దేవయ్యపటేల్, ఉపాధ్యక్షుడు భోగి బలరాజులు గురువారం ఆయనకు హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, సహకరించిన మున్నూరుకాపు సంఘం నాయకులకు శ్రీధర్‌ పటేల్‌ కృతజ్ఞతలు తెలిపారు.

పేదల గుడిసెలు తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న రామాచారి

- ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి

జ్యోతినగర్‌(రామగుండం): పేదలు ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న పోరాటం నెల రోజులు దాటినప్పటికీ స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పుడు వచ్చి, గుడిసెలు తొలగించడం ఏంటని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి ప్రశ్నించారు. గురువారం రెండో డివిజన్‌ ఇందిరమ్మ కాలనీ శివారులో చేపట్టిన భూపోరాట శిబిరంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గత నెలలో రామగుండం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇందిరమ్మ కాలనీ ఏరియాలోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం చూడాలని కోరామని పేర్కొన్నారు. నిరుపేదలు 6 వేలకు పైగా దరఖాస్తులు ఇచ్చారని, వాటికి ఎలాంటి స్పందన రాకపోవడంతో గుడిసెలు వేసుకోవడం ప్రారంభించారని చెప్పారు. ఇది నచ్చని కొంతమంది రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. అధికారులు వచ్చి గుడిసెలు తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఇళ్లు నిర్మించుకోవడం లేదని, ఎండ తీవ్రతను తట్టుకోవడానికే గుడిసెలు వేసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని, అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవర కు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్‌.ఉపేందర్, దేవేంద్ర, రమణ, భాగ్య, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరికి తరలిరండి



మాట్లాడుతున్న సుధాకర్‌

పెద్దపల్లిరూరల్‌: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఈనెల 23న జరిగే మాలల యుద్ధభేరి బహిరంగసభకు తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. రాష్ట్రంలో 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహం పెట్టగానే సరిపోదని, సమస్యలు తీర్చినప్పుడే మేలు అన్నారు. నాయకులు రమేశ్, సత్యనారాయణ, పురుషోత్తం, శ్రీరాములు తదితరులున్నారు.

మాలల సమస్యల పరిష్కారానికి పోరాటం

మాలల సమస్యలకు పరిష్కారం చూపేదాకా పోరాటం సాగిస్తామని మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం స్పష్టం చేశారు. ఈనెల 23న పెద్దపల్లిలో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. నాయకులు ఈశ్వరి, శ్రీనివాస్, సతీశ్, నాగరాజు, అశోక్, మంగ తదితరులున్నారు.

24 నుంచి సింగరేణి పాఠశాలలో అడ్మిషన్లు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్‌–3 సింగరేణి పాఠశాలలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 24 నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు డీజీఎం పర్సనల్‌ అండ్‌ అధికార ప్రతినిధి, పాఠశాల కరస్పాండెంట్‌ రాజేంద్రప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ఫీజు, క్రీడలు, ఎన్‌సీసీ, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ శిక్షణ, క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తంను 98492 15692 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ రఘువీర్‌ సింగ్‌
- కాచాపూర్‌లో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న చైర్మన్‌ రఘువీర్‌సింగ్‌

జూలపల్లి(పెద్దపల్లి): పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పల్లెల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ రఘువీర్‌సింగ్‌ అన్నారు. జూలపల్లి మండలంలోని కాచాపూర్‌లో గురువారం మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ కంది చొక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతీ 50 మంది ఓటర్లకు ఒక నాయకుడిని నియమించుకొని, పథకాలపై ప్రచారం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ జన్మదినం సందర్భంగా కేక్‌ కట్‌ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మొగురం రమేశ్, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, అడప లక్ష్మణ్, గ్రామశాఖ అధ్యక్షుడు శంకరయ్య, మహిళా అధ్యక్షురాలు అమృత, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు లక్ష్మీరాజం, నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నపేట చెరువులో వ్యక్తి మృతదేహం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై శ్రీనివాస్‌

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట పెద్దచెరువులో బంధంపల్లికి చెందిన పూరెల్ల వెంకటేశం (47) మృతదేహం లభ్యమైంది. బసంత్‌నగర్‌ ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పూరెల్ల రాజయ్య–రాధమ్మ దంపతులు. వీరికి సంతానం లేరు. ఈ క్రమంలో రాజయ్య ఏడాది క్రితం చనిపోయాడు. ఆయన తమ్ముడి కుమారుడు వెంకటేశం అంత్యక్రియలు నిర్వహించాడు. ఆ సమయంలో తమ పేరిట ఉన్న భూమిని మీకే ఇస్తానంటూ రాధమ్మ హామీ ఇచ్చింది. తర్వాత ఎవరికీ చెప్పకుండా బొంపల్లి గ్రామంలో ఉండే తన తమ్ముళ్ల పేరిట రిజిస్ట్రేషన్‌ చేసింది. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా ఎటూ తేలలేదు. ఈ నేపథ్యంలో వెంకటేశం బుధవారం బొంపల్లిలో ఉంటున్న రాధమ్మ, ఆమె తమ్ముళ్లతో మాట్లాడి వస్తానని ఇంట్లో చెప్పి, వెళ్లాడు. గురువారం అప్పన్నపేట పెద్ద చెరువులో శవమై తేలాడు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. తన భర్త మృతికి రాధమ్మ, ఆమె తమ్ముళ్లు నాడెం రాజేశం, గట్టయ్య, సంజీవ్‌లే కారణమని మృతుడి భార్య పద్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

బొగ్గుబాయి వార్తలు

వేసవిలో శాకాహారానికే ప్రాధాన్యమివ్వాలి

- సింగరేణి ఆరోగ్య అధికారి డాక్టర్‌ ఎన్‌.సుమన్‌



మాట్లాడుతున్న డాక్టర్‌ సుమన్‌

గోదావరిఖని(రామగుండం): వేసవిలో శాఖాహారం తీసుకునేందుకే ప్రాధాన్యమివ్వాలని, మాంసాహారం, మసాలా దినుసుల వాడకాన్ని తగ్గించాలని సింగరేణి ఆరోగ్య అధికారి డాక్టర్‌ ఎన్‌.సుమన్‌ అన్నారు. గురువారం జీడీకే–1, 3 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వడదెబ్బ తగిలినప్పుడు తలనొప్పి, తల తిరగడం, వాంతులవడం, నీరసం, ఒళ్లు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బ తీవ్రమైతే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. బాధిత వ్యక్తిని నీడ ప్రదేశానికి తరలించి, గాలి తగిలేలా చూడాలన్నారు. ఓఆర్‌ఎస్‌ లేదా నిమ్మరసం లేదా మజ్జిగ కొద్దికొద్దిగా తాగించాలని పేర్కొన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన చికిత్స అందేలా చూడాలని చెప్పారు. వేసవికాలంలో నీళ్లు ఎక్కువగా తాగాలని, తాజాగా వండిన ఆహారం, పుచ్చకాయ, కీర దోసకాయ వంటివి తినాలన్నారు. నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలని, మద్యపానం, శీతల పానీయాలు, మాంసం, వేపుడు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎండలోకి వెళ్లినపుడు లేతరంగు దుస్తులు, తలకు టోపీ లేదా తలపాగా ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ పెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గని మేనేజర్‌ రమేశ్‌బాబు, పిట్‌ ఇంజినీర్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్జీ–3 జీఎం అభినందన



ప్రవళికను అభినందిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్‌(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్‌ గనిలో హెడ్‌ ఓవర్‌ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నపురెడ్డి రవీందర్‌ కూతురు ప్రవళిక పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో చదువు పూర్తి చేసుకుంది. ఇండియన్‌ ఇమ్యూనోలాజికల్‌ లిమిటెడ్‌లో గోల్డ్‌ మెడల్, ఆల్‌ రౌండర్‌గా ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా గురువారం ఆమెను తన కార్యాలయంలో జీఎం వెంకటేశ్వర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు సీతారామం, నాగేశ్వర్‌రావు, రఘురాం, రవీందర్‌ రెడ్డి, హరీశ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా

- ఈనెల 30న సమ్మె నోటీసు ఇచ్చేందుకు కార్మిక సంఘాలు సమాయత్తం



చర్చల్లో యాజమాన్యం, కార్మిక సంఘాలు

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో వాయిదా పడ్డాయి. గురువారం ప్రాజెక్టులోని ఆడిటోరియంలో జరిగిన చర్చల్లో యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు వేతన ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చించారు. వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినప్పటికీ కొత్త వేతన ఒప్పందంలో జరుగుతున్న జాప్యంపై కార్మిక సంఘాలు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చాయి. ఈ క్రమంలో చర్చల్లో ఎలాంటి ఒప్పందం జరగకుండానే ఈనెల 25న రామగుండంలో, 26న హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపేందుకు ఇరు వర్గాలు అంగీకరించాయి. అక్కడ పురోగతి కనిపించకపోతే ఈనెల 30న సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తీర్మానం చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రతినిధులు శామ్యూల్‌ ప్రశాంత్, దీపక్‌ పాఠక్, ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్‌ సలీంపాషా, బీజేపీ నుంచి కౌశిక హరి, కార్మిక సంఘాల నుంచి నాంసాని శంకర్, చిలుక శంకర్, భూమల్ల చందర్‌ ఉన్నారు.

కళ్లలో కారం కొట్టి పుస్తెలతాడు చోరీ

గోదావరిఖని(రామగుండం): కళ్లలో కారం కొట్టి, ఓ మహిళ మెడలోని పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఘటన గోదావరిఖని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జీఎం కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి బయటి లైట్లను తీసివేసి, కొమురమ్మ ఇంటి తలుపు కొట్టాడు. తీసిన వెంటనే ఆమె కళ్లలో కారం కొట్టి, మెడలోని 3 తులాల పుస్తెలతాడు లాక్కెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.